## క్లుప్తంగా

### మత్తు వినియోగంతో భవిత చిత్తు


మాట్లాడుతున్న పట్టణ సీఐ గీతారామకృష్ణ

తుని: జీవితాన్ని విచ్ఛిన్నం చేసే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని పట్టణ సీఐ గీతారామకృష్ణ సూచించారు. స్థానిక వివేక-వినంద కళాశాలలో విద్యార్థులకు మంగళవారం సైబర్ క్రైం, మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్, ట్రాఫిక్ నింబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాల జోలికి పోకూడదన్నారు. బంగారు భవిష్యత్తుకు గట్టి పునాదులు వేసుకోవాలని సూచించారు. వాహనాలు నడిపేటప్పుడు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

### పేకాట రాయుళ్ల అరెస్టు

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్టు సీఐ వైఆర్కే శ్రీనివాస్ తెలిపారు. ఆయన వివరాల మేరకు గ్రామ శివారులో పేకాడుతున్నట్టు అందిన సమాచారంతో మంగళవారం తెల్లవారు జామున గండేపల్లి ఎస్సై శివనాగబాబు సిబ్బందితో దాడి జరిపి వారిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.32,300 నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

### నేడు మూడు గ్రామాల్లో పల్లె పండుగ

ప్రత్తిపాడు: మండలంలోని చింతలూరు, ఉద్దండ జగన్నాధపురం, వెంకటనగరం గ్రామాల్లో ఈ నెల 16న మధ్యాహ్నం 'పల్లె పండుగ' కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని ఎంపీడీఓ కుమార్ బాబు కోరారు.

### నేడు దేవీచౌక్ కనకదుర్గమ్మ ఊరేగింపు

గోకవరం: గోకవరంలో ప్రసిద్ధి గాంచిన దేవీచౌక్ కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి జరుగుతుందని ఆలయ ప్రధాన అర్చకుడు డాక్టర్ వల్లూరి జగన్నాధశర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఊరేగింపులో అమ్మవారిని గుర్రం రథంలో ఉంచి తిప్పుతామన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామస్తులంతా ఊరేగింపులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

### ఐఎఫ్‌టీయూ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


జగ్గంపేటలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన నాయకులు

జగ్గంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లు, నేర చట్టాలకు వ్యతిరేకంగా అక్టోబర్18న విజయవాడలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మరుకుర్తి ఏసు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను మంగళవారం జగ్గంపేటలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో ఎంబీవీకే భవన్‌లో 18న ఉదయం 10 గంటలకు రాష్ట్ర సదస్సు జరుగుతుందని దీన్ని కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు, బాలరాజు, దుర్గారావు, సైకిల్ ఆఫ్ వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### నూరుశాతం ఈ-క్రాప్ నమోదు

– జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు


ఈ-క్రాప్ నమోదు పత్రాలను పరిశీలిస్తున్న జేడీఏ

గోకవరం: తూర్పుగోదావరి జిల్లాలో ఈ క్రాప్ నమోదు నూరుశాతం పూర్తయినట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మాధవరావు అన్నారు. గోకవరం నాల్గవ సచివాలయంలో ప్రదర్శించిన ఈ-క్రాప్ నమోదు జాబితాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఈ క్రాప్ నమోదు నూరు శాతం పూర్తయ్యిందన్నారు. ఈకేవైసీ మాత్రం 97 శాతం పూర్తయ్యిందన్నారు. రైతులు ఈ క్రాప్ నమోదు వివరాలు సరిచూసుకొని తేడాలు ఉంటే బుధవారం సాయంత్రం నాటికి మార్పులు చేసుకోవాలన్నారు. జిల్లాలో 367 ఆర్బీకేల్లో 220 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట కోరుకొండ ఏడీఏ మల్లికార్జునరావు, ఏఓ రాజ రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

# మురుగుకు రహదారి..!

- ఎండ కాయాలి... నీరింకాలి..
- డ్రైనేజీలు లేవు..ఉన్నవి ఆక్రమణలోనే
- ఇళ్ల ముందు, రోడ్లపైనే మురుగు, వర్షపు నీరు
- ఓవైపు కంపు.. మరోవైపు దోమల మోత

నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు వాసులను డ్రైనేజీ సమస్య పీడిస్తోంది. రోడ్ల పైన, నివాసాల వద్ద మురుగు, వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి రోగాలు వ్యాపింపజేస్తున్నాయి. పట్టుమని పది రోజులైనా ఎండలు కాయాలి... నీరు ఇంకిపోవాలే తప్ప మురుగు, వర్షపు నీరు పోయే మార్గాలే లేవు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీలే లేవు. ఉన్న డ్రైనేజీలు ఆక్రమణలకు గురికాగా మరికొన్ని కాల గర్భంలో కలిసిపోయాయి.


ప్రత్తిపాడు మెయిన్‌రోడ్డుపై వర్షపు నీరు

ప్రత్తిపాడు: సుమారు 12 వేల జనాభా కలిగిన ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలో 16 వార్డులున్నాయి. సుమారు రెండు కిలో మీటర్ల పొడవున్న మెయిన్ రోడ్డు వెంబడి రెండు వైపులా డ్రైన్లు ఉన్నప్పటికీ కొంత మేర ఆక్రమణలోనూ, మిగిలినది పూడిక పోయి, మూసుకుపోయింది. చాలా చోట్ల డ్రైన్లు కాల గర్భంలో కలిసిపోయాయి. గ్రామంలోని ఓ పక్క కొండ ప్రాంతం కావడంతో కురిసిన వర్షపు నీరు, మురుగు నీరు పల్లానికే ప్రవహిస్తోంది. అయితే డ్రైన్లు లేకపోవడం వల్ల ప్రత్తిపాడు మెయిన్ రోడ్డు మీదుగానే ప్రవహిస్తోంది. అగ్నిమాపక కేంద్రం ఆవరణ గత వారం రోజులుగా వాన నీటి ముంపులోనే ఉంది. కొద్దిపాటి వర్షానికే ప్రభుత్వ కార్యాలయాల వద్ద, అల్లూరి సీతారామరాజు జంక్షన్, గ్రామ పంచాయతీ వెనుక వీధి చెరువులను తలపిస్తోంది. గ్రామంలోని దాదాపు అన్ని వార్డుల్లోనూ ఇదే పరిస్థితి. ఇందిరా కాలనీ, హరిజన కాలనీ, యానాది పేట తదితర చోట్ల మురుగు నీరు రోడ్లమీదే పారుతోంది. తోట వీధి, ఇందిరా కాలనీలో వర్షం పోయిన తర్వాత నివాస గృహాల వారు వృధా నీటిని రోడ్లపైకి వదులుతుండడంతో అది


ప్రత్తిపాడు పంచాయతీ వెనుక వీధిలో నీట మునిగిన సిమెంట్ రోడ్డు

కాస్తా డ్రైన్లు లేక సిమెంటు రోడ్లు, నివాస గృహాల మీదుగా ప్రవహిస్తోంది. రోడ్లపై అక్కడక్కడా ఏర్పడిన గుంతలలో వర్షపు నీరు నిల్వ ఉండి రోజులు గడిచేకొద్దీ కంపు కొడుతోందని, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నామని గ్రామ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

#### పట్టించుకునే నాథుడే లేడు..



గ్రామంలో చాలా డ్రైన్లు పూడికపోయి కొన్ని, ఆక్రమణలకు గురై కొన్ని ఉన్నాయి. డ్రైన్లలో పారాల్సిన మురుగు రోడ్లపైనే ఉంటోంది. మురుగునీటి సమస్యను గతంలో ఎంతోమంది నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. వర్షాకాలంతో ఈ సమస్య తీవ్రంగా ఉంటోంది. దోమలు అధికమై రోగాల బారిన పడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– **ధరణాలకోట శ్రీను**, పీసీసీ సభ్యుడు, ప్రత్తిపాడు.

#### డ్రైనేజీలు నిర్మించాలి



గ్రామంలో డ్రైనేజీలు నిర్మించి, మురుగు నీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు చేపట్టాలి. మురుగునీరు ఇళ్ల ముందుకు రాకుండా మట్టితో అడ్డు వేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఎక్కడ పడిపోతామోనన్న భయంతో రోడ్లపై భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. అధికారులు, నాయకులు స్పందించాలి.

– **తాతపూడి బుజ్జి**, యోగా గురువు, ప్రత్తిపాడు.

#### ప్రక్షాళన చేస్తాం



ఇటీవలే గ్రామ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నా. డ్రైనేజీ వ్యవస్థపై వచ్చిన ఫిర్యాదుల మేరకు గ్రామంలో పర్యటించాను. చాలా చోట్ల డ్రైనేజీలు ఆక్రమణలో ఉన్నాయి. డ్రైనేజీల నిర్మాణం, ఆక్రమణల తొలగింపు, పూడికతీతలపై ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించి, నిధులు విడుదలైన వెంటనే గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ప్రక్షాళనం చేస్తాం.

– **జ్యోతుల పద్మరాజు**, గ్రామ పంచాయతీ కార్యదర్శి, ప్రత్తిపాడు.

### సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


ప్రొఫెసర్ రాముడు

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి రాముడుకు డాక్టరేట్ లభించినట్టు యూనివర్సిటీ వైస్ చైర్మన్ ఎస్ సతీష్‌రెడ్డి తెలిపారు. జీవన్ జ్యోతి సింగ్ నేతృత్వంలో 'డిజైన్ అండ్ అనాలసిస్ ఆఫ్ మోడిఫైడ్ మాడ్యులర్ మల్టీ లెవెల్ కన్వర్టర్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్' అనే అంశంపై రాముడు సమర్పించిన థీసిస్‌కు గానూ ఈ డాక్టరేట్ వచ్చిందని తెలియజేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సిల్చార్ విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పొందినట్టు పేర్కొన్నారు. చైర్మన్ ఎస్ శేషారెడ్డి, డైరెక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి, డీన్ దోలా సంజయ్ కుమార్ తదితరులు అభినందనలు తెలిపారు.

### నేడు గోకవరంలో ట్రాఫిక్ ఆంక్షలు

గోకవరం: గోకవరంలో దేవీచౌక్ కనకదుర్గమ్మ భారీ ఊరేగింపును పురస్కరించుకొని బుధవారం ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్టు ఎస్సై పవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం నుంచి గోకవరం మీదుగా రంపచోడవరం రాకపోకలు సాగించే వాహనాలు వీరలంకపల్లి , పెంటపల్లి, రంపయర్రంపాలెం, ఠాకూరుపాలెం, కొత్తపల్లి, రామన్నపాలెం గ్రామాల మీదుగా మళ్లించడం జరిగిందన్నారు. రాజమహేంద్రవరం నుంచి గోకవరం వెళ్లే ఆర్టీసీ బస్సులను గోకవరం లారీ యూనియన్ కార్యాలయం వద్ద, రంపచోడవరం నుంచి వచ్చే బస్సులు తంటికొండ రోడ్డులోని ఆర్చి వద్ద, కాకినాడ వైపు వెళ్లే బస్సులు డ్రైవర్స్‌కాలనీ వద్ద తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## సత్యదేవుని దర్శనానికి తప్పని ఇక్కట్లు

- రత్నగిరిపైకి సకాలంలో బస్సులు లేక భక్తుల అవస్థలు
- కాలినడకనే కొండపైకి ప్రయాణం


మంగళవారం తెల్లవారు జామున బస్సుల కోసం భక్తుల నిరీక్షణ

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకూడదని దేవస్థానం అధికారులు రూ.80 లక్షలు వెచ్చించి రెండు కొత్త బస్సులు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. ఈ బస్సులు పర్మిట్లు వచ్చాక వీటిని నడుపుతామని దేవస్థానం ఈఓ కే రామచంద్రమోహన్ తెలిపారు. ఆ మేరకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ప్రస్తుతం నడుపుతున్న బస్సులను సకాలంలో నడపకుండా కొంతమంది డ్రైవర్లు, కండక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి రోజు తెల్లవారు జామున మూడు గంటల నుంచి టోల్ గేట్ వద్ద రెండు దేవస్థానం బస్సులు సిద్ధంగా ఉండాలి. అయితే మంగళవారం తెల్లవారు జామున సత్యదేవుని ఆలయానికి వెళ్లేందుకు దేవస్థానం బస్సులు అందుబాటులో లేక భక్తులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆటోలలో వెళదామన్నా ఉదయం ఆరు గంటల వరకు ఆటోలను రత్నగిరికి అనుమతించని పరిస్థితి. దీంతో తెల్లవారు జామున గంట సేపు భక్తులు వేచి ఉండాల్సి వచ్చింది.

దసరా వేడుకలకు విజయవాడ కనకదుర్గ అమ్మవారి దర్శనానికి టూరిస్ట్ బస్సులలో వెళ్లిన భక్తులు తిరుగు ప్రయాణంలో రాత్రి తొమ్మిది, పది గంటలకు అన్నవరం వస్తున్నారు. వీరు తమ బస్సులను దేవస్థానం కళాశాల మైదానంలో నిలిపివేసి తెల్లవారు జామున సత్యదేవుని ఆలయానికి వెళ్లి స్వామివారిని దర్శించి తిరిగి తమ స్వస్థలాలకు వెళుతున్నారు. సోమవారం రాత్రి విజయవాడ నుంచి వచ్చిన భక్తులు తమ టూరిస్ట్ బస్సులను దేవస్థానం కళాశాల మైదానంలో నిలిపివేశారు. స్వామివారి ఆలయానికి 24 గంటలూ దేవస్థానం బస్సులు నడుపుతారని, కొండ దిగువన టోల్‌గేట్ నుంచి తెల్లవారు జామున మూడు గంటల నుంచి బస్సులు ఉంటాయని అక్కడ సిబ్బంది చెప్పారు. దీంతో మంగళవారం తెల్లవారు జామున 3.30 గంటలకు భక్తులు టోల్‌గేట్ వద్దకు రాగా ఒక్క బస్సు కూడా లేదు. దీంతో చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చిందని భక్తులు ఆవేదన చెందారు. కొంత మంది భక్తులు ఆ చీకటిలోనే ఘాట్‌రోడ్ ద్వారా నడిచి ఆలయానికి వెళ్లారు. చివరకు 4-30 గంటలకు బస్సు రావడంతో భక్తులు ఆ బస్సు ద్వారా రత్నగిరికి వెళ్లారు.

దీనిపై దేవస్థానం ట్రాన్స్‌పోర్టు గుమస్తా బీఎస్ఎన్ రాజును వివరణ కోరగా తెల్లవారు జామున 3.15 గంటలకు ఒక బస్సు టోల్‌గేట్ నుంచి రత్నగిరికి వెళ్లిందని తెలిపారు. ఆ బస్సు మళ్లీ 4.30 గంటలకు కొండ మీద నుంచి టోల్‌గేట్ వద్దకు వచ్చిందని తెలిపారు. ఈ మధ్య వ్యవధిలో గంట సేపు భక్తులు వేచి ఉండాల్సి వచ్చిందని తెలిపారు. ఇకపై దేవస్థానం టోల్‌గేట్ నుంచి తెల్లవారు జాము మూడు గంటల నుంచి పావు గంటకొక బస్సు సరీ్వసు రత్నగిరికి నడుపుతామని తెలిపారు.

## రహదారులు గుంతల మయం


జగపతినగరం శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పడిన గుంతలు

కిర్లంపూడి: మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గోతుల రహదారిలో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం నుంచి ప్రత్తిపాడు వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రాజుపాలెం నుంచి వీరవరం, రామచంద్రపురం, తామరాడ, గోనేడ గ్రామాలకు వెళ్లే రోడ్డు మరీ అధ్వానంగా మారింది. కురుస్తున్న వర్షాలకు కిర్లంపూడి నుంచి సింహాద్రిపురం, వేలంక రోడ్లపై రాళ్లు పైకి లేవడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పాడ్డాయి. ఈ రూట్లలో రాత్రి వేళల్లో ఆదమరిచి డ్రైవింగ్ చేసే వాహనదారులు అనేక మంది ప్రమాదాల బారిన పడ్డారు. అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన రోడ్లు బాగుచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

### దివ్యాంగుల సంక్షేమానికి కృషి


దివ్యాంగునికి ట్రైసైకిల్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రత్తిపాడు: దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్మే వరుపుల సత్యప్రభ అన్నారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన దివ్యాంగులకు ఉపకరణాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు లయన్స్‌క్లబ్ కమ్యూనిటీ హాలు ఆవరణలో మంగళవారం సాయంత్రం ఏర్పాటైన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటు పడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, అలమండ చలమయ్య, జ్యోతుల పెదబాబు, అమరాది వెంకట్రావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు, నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం ఎంపీడీఓలు ఎంవీఆర్ కుమార్, శివరామకృష్ణ, శర్మ తదితరులు పాల్గొన్నారు.

**గ్రామాభివృద్ధే లక్ష్యం**

ప్రత్తిపాడు రూరల్: గ్రామాభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. మండలంలోని రాచపల్లి గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించనున్న సిమెంటు రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు బుద్దరాజు గోపిరాజు, ఈఓపీఆర్డీ కాశీవిశ్వనాథ్, కార్యదర్శి లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం


కాలువలోని మృతదేహం

ఏలేశ్వరం: పట్టణంలోని పంట కాలువలో మంగళవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. స్థానిక పెట్రోల్‌బంక్ వద్ద చర్చి సమీపంలోని పంట కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడికి సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుంది. దీనిపై పోలీసులకు సమాచారం అందలేదు.

## కలాం చూపిన బాటలో యువత నడవాలి


ఏలేశ్వరంలో కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సూర్యకుమార్

ఏలేశ్వరం: భారత రత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలు మంగళవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ సామంతుల సూర్యకుమార్ ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ కార్యాలయం వద్ద అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలు అపూర్వమన్నారు. కలాం జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన ప్రసంగాలు విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. రాబోయే తరాలకు ఆయన చూపిన మార్గం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. ఆయన చూపిన బాటలో యువత పయనించాలన్నారు.

## అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ


ఏలేశ్వరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


శంఖవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


తేటగుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

తుని రూరల్: చిన్నారుల్లో నెలకొనే అభ్యాస వైకల్యాలపై విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. మంగళవారం తుని మండలం తేటగుంటలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.విశాలి ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 18 వరకు 'వాక్ ఫర్ డిస్లెక్సియా' పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయుడు జి.రామకొండబాబు, విద్యా కమిటీ చైర్మన్ చామంతి దుర్గారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటనందూరు: స్థానిక నాన్ భవిత కేంద్రం సిబ్బంది మంగళవారం డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిస్లెక్సియా వ్యాధి కారకాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఈఓ రామశేఖర్ మాట్లాడుతూ డిస్లెక్సియాపై తల్లిదండ్రులు అవగాహన పెంచుకొని పిల్లల పరంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో మంగళవారం డిస్లెక్సియాపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ లక్ష్మీతులసి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యార్థులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కిర్లంపూడి: డిస్లెక్సియా గల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఎంఈఓలు టి.జోషఫ్, ఎం.చిన్నారావు అన్నారు. స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వోన్నత పాఠశాలలో మంగళవారం డిస్లెక్సియాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభ్యసనలో ఇబ్బందులు ఎదురయ్యే వారిని గుర్తించి ప్రత్యేక శ్రద్ధతో రెమెడియల్ క్లాసులు నిర్వహించడం ద్వారా వారి లోపాలను అధిగమించవచ్చని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కల్యాణ్, ఐఈడీఎస్ఎస్ నూకరాజు, ప్రసన్న పాల్గొన్నారు.

**మెరుగైన విద్య అందించాలి**

శంఖవరం: మతి మరుపు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని ఎంఈఓ ఎస్‌వీ రమణ అన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మతిమరుపు పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. మతి మరుపు విద్యార్థులను ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో చూడాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాస్కర లక్ష్మి, ఉపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీఎస్ జి.స్వప్న, బి.నాగార్జున, డి.బ్రహ్మానందరావు తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేట: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా విద్యను అభ్యసించాలని వారికి అవసరమైన విద్యను అందించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని జగ్గంపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగా తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యాజమాన్య పద్ధతులతో మెరుగైన ఫలితాలు


పాతకొట్టాంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న శివకుమారి


కోదాడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డాట్ శాస్త్రవేత్త డాక్టర్ శర్మ

కోటనందూరు: వరిసాగులో ఎరువులు, పురుగు మందుల యాజమాన్యంతో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వ్యవసాయ విస్తరణాధికారి కేవీ శివకుమారి అన్నారు. పాతకొట్టాంలో మంగళవారం పొలం పిలుస్తోంది గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు రైతుల పరంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వాటిని వినియోగించుకునే విధానాన్ని వివరించారు. అనంతరం అధికారులు వరి, ఉద్యాన పంటల క్షేత్రాలను పరిశీలించారు. ప్రస్తుతం పంటను ఆశించిన తెగుళ్లను గుర్తించి వాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తాండవ ఏఈఓ దుర్గబాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాగబాబు, వీఏఏ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

**వరిలో తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి**

తొండంగి: ఖరీఫ్‌లో వరిలో వచ్చే తెగుళ్లు, ఎలుకల నివారణపై రైతులు దృష్టి సారించాలని డిస్ట్రిక్ట్ అగ్రికల్చరల్ అడ్వైజరీ, ట్రాన్స్ఫర్ ఆఫ్ టెక్నాలజీ సెంటర్(డాట్) శాస్త్రవేత్త డాక్టర్ శర్మ అన్నారు. మంగళవారం తొండంగి మండలం కోదాడలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వరిలో అగ్గి తెగులు, ఆకుమచ్చ తెగులు, పొట్టకుళ్లు తెగులు, గోధుమ రంగు మచ్చ తెగులు, కాటుక లేదా మానిపండు తెగులు వంటివాటి నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వరిచేనుకు అగ్గితెగులు అన్ని దశల్లోనూ వస్తుందన్నారు. ఆకుమచ్చ తెగులు పిలక పొట్ట దశలో ఎక్కువగా సోకే అవకాశం ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనల మేరకు నివారణ మందులు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో తుని ఏడీఏ సుంకర బుల్లిబాబు, ఏఓ ఎస్.నరసింహం, మత్స్యశాఖ, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కిర్లంపూడి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఎస్.వెంకట రమణ తెలిపారు. ప్రత్తిపాడు మండలం ప్రత్తిపాడు గ్రామానికి చెందిన నట్టే భద్రరావు(35) శుక్రవారం రాత్రి ఏడు గంటలకు మల్లేపల్లిలోని తన అత్తవారి ఇంటి వద్ద నుంచి తన చిన్న కుమారుడిని తీసుకురావడానికి బైకుపై బయలు దేరాడు.ఈ క్రమంలో కిర్లంపూడి మండలం బూరుగుపూడి జాతీయ రహదారిపై గుర్తు తెలియని మహిళను ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికులు హైవే సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో జగ్గంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు మగ పిల్లలు ఉన్నారు.